
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



భద్రాద్రి కొత్తగూడెం

గురువారం ఉష్ణోగ్రత ఖమ్మం: గరిష్ఠం 29 । కనిష్ఠం 18 | భద్రాద్రి: గరిష్ఠం 26 । కనిష్ఠం 18 ◆ శుక్రవారం, 5 జనవరి 2024



స్వామి వారి కల్యాణం దృశ్యం (ఫైల్)

ఏప్రిల్ 9నుంచి 23 వరకు
భద్రాద్రిలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు

17న నవమి కల్యాణం, 18న మహాపట్టాభిషేకం

భద్రాచలం, జనవరి 4 : శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏప్రిల్ 9నుంచి 23వరకు తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో భాగంగా శ్రీరామనవమి రోజైన 17న మిథిలా స్టేడియంలోని శిల్పకళాశోభిత కల్యాణ మండపంలో సీతారామచంద్రస్వామి కల్యాణం, మరుసటిరోజైన 18న మహాపట్టాభిషేకం, రథోత్సవం నిర్వహించనున్నారు. 9న క్రోధినామసంవత్సర ఉగాది పండుగ సందర్భంగా ఈ ఉత్సవాలు ప్రారంభం కానుండగా నూతన పంచాంగ శ్రవణం, తిరువీధి సేవలను ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో 13వతేదీన బ్రహ్మోత్సవాలకు అంకురారోపణం, 14న ధ్వజపట లేఖనం, 15న ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, 16న ఎదుర్కోలు ఉత్సవం, 17న శ్రీరామనవమి, 18న మహాపట్టాభిషేకం నిర్వహించనున్నారు. 19న మహాదశీర్వచనం, 20న తెప్పోత్సవం , దొంగలదోపు, 21న ఊంజల్ సేవ, 22న వసంతోత్సవం, 23న చక్రతీర్థం, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షణలు, ద్వాదశ ఆరాధనలు, శ్రీపుష్ప యాగం నిర్వహించనున్నారు. అయితే తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు జరిగే ఏప్రిల్ 9 నుంచి 23 వరకు నిత్యకల్యాణాలను, 13వతేదీ నుంచి 23 వరకు దర్బారు సేవ, ప్రభుత్సోత్సవాన్ని నిలిపేయనున్నారు. ఇక మే 2న నూతన పర్యంకోత్సవాన్ని నిర్వహించనున్నారు.

ఈసారి ముత్యాల తలంబ్రాలతో సీఎం!

ఈ ఏడాది శ్రీరామనవమి రోజున భద్రాచలంలో నిర్వహించే సీతారామచంద్రస్వామి కల్యాణానికి నూతన సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలతో వస్తారని రామభక్తులు ఎదురుచూస్తున్నారు. 2016 ఏప్రిల్ 15న జరిగిన శ్రీరామనవమికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించగా అనంతరం ఆయన శ్రీరామనవమికి రాకపోవడం రామ భక్తులను ఆవేదనకు గురి చేసింది. వివిధ కారణాలతో గత సీఎం రాకపోవడంతో అప్పటి దేవాదాయ శాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కాగా 2017 ఏప్రిల్ 5న జరిగిన శ్రీరామనవమికి తొలిసారిగా గవర్నర్ నరసింహన్ దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది. ఈ నేపథ్యంలో ఈసారి జరిగే రామయ్య కల్యాణానికి సీఎం తప్పక వస్తారనే ఆశాభావంతో రామ భక్తులు భద్రాద్రివాసులున్నారు.

ప్రజాపాలన సభలకు
రేపు ఆఖరు



ఖమ్మంలో దరఖాస్తులు ఇచ్చేందుకు బారులుదీరిన ప్రజలు

- ఉమ్మడి జిల్లా ప్రజల నుంచి విశేష స్పందన
- అధికారులకు అధికసంఖ్యలో అందుతున్న దరఖాస్తులు



అశ్వారావుపేటలో

ఖమ్మం (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/ ఖమ్మంకలెక్టరేట్, జనవరి 4 : అర్హులైన వారికి ఆరుగ్యారంటీ పథకాలను అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రజాపాలన సభలను నిర్వహిస్తోంది. గ్రామపంచాయతీలు, మునిసిపల్ వార్డుల్లో జరుగుతున్న ఈ కార్యక్రమం శనివారంతో ముగియబోతోంది. గతనెల 28న ప్రారంభమైన ఈ సభలు గతనెల 31, ఈనెల 1 వతేదీ మినహా మిగిలిన రోజుల్లో ఉమ్మడిజిల్లా ప్రజలనుంచి విశేష స్పందన వచ్చింది. ఖమ్మం జిల్లాలో జిల్లాలో 589 గ్రామపంచాయతీలు, 125 మునిసిపల్ వార్డుల్లో ఇప్పటి వరకు మొత్తం 3,30,414దరఖాస్తులు రాగా ఆరోరోజైన గురువారం 61,691దరఖాస్తులు అందాయి. భద్రాద్రి జిల్లాలో గురువారం వరకు మొత్తం 390గ్రామపంచాయతీలు, 78మునిసిపల్ వార్డుల్లో 2,63,327 కుటుంబాల నుంచి 2,42,570 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న ఈ ప్రజాపాలన కార్యక్రమాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించగా.. శుక్రవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిరలో జరిగే కార్యక్రమానికి హాజరుకానున్నారు. చివరి రెండురోజులైన శుక్ర, శనివారాల్లో దరఖాస్తుదారులు భారీగా వచ్చే అవకాశం ఉంటుందని, ఈ క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశామని, ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను కంప్యూటరీకరణ చేసేలా ఏర్పాట్లు చేశామని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. జిల్లాలో 589 గ్రామపంచాయతీలు, 125 మునిసిపల్ వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేశామన్నారు.

ఆన్‌లైన్ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్

ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తేనున్నారు. పంచాయతీ, పట్టణంలో వార్డు స్థాయిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రత్యేక నెంబర్‌ను కేటాయించి ఏ రోజుకారోజు ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. వీటన్నింటినీ పొందు పరిచేందుకు ప్రభుత్వస్థాయిలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిసింది. ప్రతీ దరఖాస్తుకు ఒక సంఖ్యను కేటాయించి ఆ తర్వాత విచారణ నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

- ప్రజాపాలన సభను సద్వినియోగం చేసుకోండి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జనవరి 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : అర్హులందరికీ ఆరుగ్యారంటీ పథకాలను అందిస్తామని, ఆ లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, దీన్ని ప్రజలు వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలో గురువారం పలుచోట్ల జరిగిన ప్రజాపాలన కార్యక్రమాలను పరిశీలించిన ఆయన 49వడివిజన్ రామాలయం వద్ద నిర్వహించిన ప్రజాపాలన సభలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం హామీలన్నిటిని నెరవేరుస్తుందని, అభయహస్తం కార్యక్రమం కింద తీసుకుంటున్న దరఖాస్తులన్నీ కూడా కంప్యూటరీకరణ చేసి అర్హులందరికీ ఆరుగ్యారంటీ పథకాలు అందేలా చూస్తామని ప్రకటించారు. ఈ ప్రజాపాలనతో ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరిగిందని, ప్రజల నుంచి వస్తున్న స్పందన అందుకు నిదర్శనమన్నారు. 6వ తేదీతో ముగియనున్న పజాపాలన సభల కోసం విస్తృత ఏర్పాట్లు చేశామని, ప్రజలు ప్రశాంతంగా దరఖాస్తులు అందించి రశీదులు తీసుకుని భద్రపరుచుకుంటున్నారని, అధికారులుకూడా ఎవరినీ ఇబ్బందులు పెట్టడం లేదన్నారు. సకాలంలో గ్రామసభలో దరఖాస్తులను అందించలేకపోయినా మరుసటి రోజుకూడా అందించవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీ పథకాల్లో ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ రూ.10లక్షల పెంపు అమలు చేస్తున్నామని, మిగిలిన పథకాలను కూడా దశలవారీగా త్వరలోనే అమల్లోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఆదర్శసురభి, పట్టణ ఏసీపీ హరికృష్ణ, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి పాల్గొన్నారు.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల



మిర్చికల్లంగా క్రీడాప్రాంగణం..

గ్రామీణ విద్యార్థులు, యువతకు క్రీడల్లో నైపుణ్యాన్ని కల్పించే లక్ష్యంతో గత ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి గ్రామగ్రామాన క్రీడాప్రాంగణాలను నిర్మించింది. కొన్నిచోట్ల ఎంతమేరకు అవసరం అనేది కూడా చూడకుండా ఈ ప్రాంగణాలను నిర్మించడంతో.. అవి క్రీడాకారుల అవసరాలకంటే ఇతర అవసరాలకే ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి. అందుకు నిదర్శనమే.. ఈ క్రీడాప్రాంగణం. ఖమ్మంజిల్లా ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం ఖాళీగా ఉండడంతో రైతులు మిర్చి ఆరబోసే కల్లంగా ఉపయోగించకుంటున్నారు. ఈప్రాంగణంలో ఆటలాడే వారు ఎవరూ లేకపోవడంతో ప్రస్తుతం మిర్చిని ఆరబెట్టారు. రాష్ట్రంలో ఇలా ఎన్నో క్రీడాప్రాంగణాలు ఉపయోగంలో లేవు. దీంతో రూ.లక్షలు వెచ్చించిన ఫలితం లేకుండా పోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

లోక్‌సభపై దృష్టి

- ఎన్నికలకు సిద్ధమవుతున్న పార్టీలు
- ప్రధానపార్టీల నుంచి ప్రచారంలో పలువురిపేర్లు



ఖమ్మం, జనవరి 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల ఘట్టం ముగియడంతో పార్టీలన్నీ త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలపై దృష్టి పెట్టి వ్యూహరచన చేసుకుంటున్నాయి. గెలుపుగుర్రాలను బరిలో దింపి విజయం సాధించేందుకు కుస్తీ మొదలుపెట్టాయి. ఇప్పటికే ప్రధానపార్టీల నేతలు సమీక్షలు నిర్వహిస్తూ ఎన్నికల ప్రణాళికలను, అనుసరించాల్సిన వ్యూహాలను రూపొందించుకునే పనిలో నిమగ్నమయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో పీసీసీ సమావేశం జరగ్గా.. అందులో అన్ని జిల్లాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, రంగంలోకి దించాల్సిన అభ్యర్థుల విషయంలో చర్చించారు. అలాగే ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలను రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించారు. అయితే ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మంలోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఈ ఫలితాల నేపథ్యంలో ఖమ్మం పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా సునాయాసంగా గెలిచే పరిస్థితి. దీంతో పోటీకి పలువురు సై అంటే సై అంటున్నారు. ఎవరికివారు తామే అభ్యర్థులమంటూ ప్రచారాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం జాతీయ స్థాయి రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని దీటైన అభ్యర్థులను ఎంపికచేసే అవకాశం ఉంది. మరోవైపు విపక్ష బీఆర్ఎస్ కూడా లోక్‌సభ ఎన్నికలపై దృష్టిపెట్టి.. ఈనెల 9న హైదరాబాదులో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహిస్తోంది. సిట్టింగ్ ఎంపీగా ఉన్న నామ నాగేశ్వరరావే అభ్యర్థి అంటూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సత్తుపల్లి ప్రజాఆశీర్వాద సభ వేదికగా కేసీఆర్ సూచనప్రాయ ప్రకటన చేశారు. దీంతో నామ నాగేశ్వరరావు మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగుతారన్న చర్చ జరుగుతుండగా..
ఓటమి నైరాశ్యంలో ఉన్న బీఆర్ఎస్ నుంచి ఇతరులెవరూ పెద్దగా ఆసక్తిచూపడం లేదన్న చర్చ జరుగుతోంది. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ కూడా నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తుండగా 10లేదా11తేదీల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ సమీక్ష ఉండే అవకాశం కనిపిస్తోంది. జిల్లా నుంచి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి టికెట్లు ఆశిస్తున్నారు. జిల్లానేతలకు ఇస్తారా లేక రాష్ట్రస్థాయిలో ప్రముఖులను ఎవరినైనా బరిలో దింపుతారా అన్నది చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ఎన్నికల్లు కాంగ్రెస్‌తో కలిసి నడిచిన సీపీఐ లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తోనే దోస్తీ చేసే అవకాశాలుండగా.. సీపీఎం ఒంటరిగా పోటీచేస్తుందా లేక ఎవరికైనా మద్దతు ఇస్తుందా అనేది నిర్ణయించాల్సి ఉంది. మొత్తంగా ఇటీవలి అసెంబ్లీ ఫలితాల నేపథ్యంలో త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల సర్వత్రా ఆసక్తి రేపుతున్నాయి.

ఖమ్మంలో సమాచారశాఖ
ఏడీ కార్యాలయం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు

ఖమ్మం, జనవరి 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఖమ్మంజిల్లాకు సమాచారశాఖ ఏడీ కార్యాలయం రానుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఖమ్మంలో సమాచారశాఖ ఏడీలేదా డీడీ స్థాయి కార్యాలయం ఏర్పాటు చేసి.. తద్వారా సమాచారశాఖ సేవలను విస్తృతం చేయాలని, అదనపు అధికారులు, సిబ్బందిని నియమించాలని పలువురు జర్నలిస్టులు.. ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రెవెన్యూ సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో డిప్యూటీసీఎంతో పాటు ఇద్దరు మంత్రులున్నందున ప్రస్తుతం ఉన్న అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, డీపీఆర్వో కార్యాలయాన్ని అప్‌గ్రేడ్ చేయాలని కోరడంతో ఇందుకు సంబంధించి తక్షణ చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఆ తర్వాత హైదరాబాదు వెళ్లిన మంత్రి బుధవారం సమాచారశాఖ అధికారులతో మాట్లాడి ఖమ్మంలో ఏడీ కార్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించడంతో అందుకు సంబంధించిన ఫైల్‌ను వారు ప్రభుత్వానికి పంపారు. దీంతో త్వరలోనే కార్యాలయ ఏర్పాటు ఆదేశాలు రానున్నాయని, ఖమ్మంలో ఏడీ కార్యాలయం ఏర్పాటుకు చొరవ తీసుకున్న మంత్రి పొంగులేటికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నాయకులు రాంనారాయణ, జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, తదితరులు మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నెస్పీలో
ఆక్రమణలను తొలిగిస్తాం

- ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు
- నీటిపారుదల శాఖ సీఈ విద్యాసాగర్





ఖమ్మం, జనవరి 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : నాగార్జునసాగర్ ఎడమకాలువ మిగులుభూముల్లో అక్రమంగా ఎవరు నిర్మాణాలు కట్టినా తొలగిస్తామని, ఈ భూముల ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఖమ్మం ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్ తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఆక్రమణల లెక్కతేలేనా?' శీర్షికన ఎన్నెస్పీ భూముల అన్యాక్రాంతం, అనుమతి లేకుండా వెలుస్తున్న షెడ్ల వ్యవహారంపై ప్రచురితమైన కథనంతో ఆయన స్పందించారు. మిగులు భూములు ప్రభుత్వానికి చెందినవని, ఎవరైనా తప్పుడు రికార్డులు చూపి తమ భూములుగా చెప్పుకొన్నా వారిపై చర్యలు తప్పవని తెలిపారు. ఎన్నెస్పీతో పాటు ఇరిగేషన్ అధికారులను కాలువ భూములపై తనిఖీ చేయిస్తామని, ఎక్కడైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నా పట్టా భూములని చెప్పి ఎన్నెస్పీ భూములను ఆక్రమించుకుంటున్నా వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని ఎన్నెస్పీ భూముల విషయంలో కోర్టులో నడుస్తున్నాయని, అలాంటివి తమ భూములుగా ఎవరైనా చెప్పుకున్నా వాటిపై కూడా చర్యలుంటాయని సీఈ పేర్కొన్నారు.



బీఆర్ఎస్ నేతల సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి పువ్వాడ

'ఖమ్మం లోక్‌సభ' సన్నాహక సమావేశం ఎంతో కీలకం

- ప్రతీ నియోజకవర్గం నుంచి 100మంది ముఖ్యులు హాజరుకావాలి
- బీఆర్ఎస్ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం కార్పొరేషన్, జనవరి 4: ఈ నెల 9న హైదరాబాద్‌లో జరిగే ఖమ్మం పార్లమెంటరీ సన్నాహక సమావేశం ఎంతో కీలకమైందని. పార్లమెంట్ పరిధిలోని ప్రతీ నియోజకవర్గంనుంచి 100 మంది ముఖ్యులు హాజరుకావాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. గురువారం ఖమ్మంలోని మమత ప్రాంగణంలోని తన నివాసంలో నిర్వహించిన బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ సమాయత్తమవుతోందన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయంమేరకు పనిచేయాలని, హైదరాబాద్‌లోని తెలంగాణాభవన్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్, ఇతర ముఖ్యనేతలు నిర్వహించే ఈ సమావేశానికి తప్పక హాజరకావాలని కోరారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, భవిష్యత్ ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు గుండాల కృష్ణ, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, మద్దినేని వెంకటరమణ, తాళ్లూరి జీవన్‌కుమార్, గుత్తా రవి, నున్నా మాధవరావు, శీలంశెట్టి వీరభద్రం, వీరూనాయక్, తదితరులు పాల్గొన్నారు..

ధాన్యం దళారులు.. రూటు మార్చారు

- గుట్టుచప్పుడుకాకుండా ఛత్తీస్‌గఢ్‌కు తరలింపు
- నెల రోజుల్లో సరిహద్దు దాటిన వేల క్వింటాలు
- చర్ల మండలంలో పట్టుబడుతున్న వాహనాలు

చర్ల, జనవరి 4: ధాన్యం వ్యాపారం చేస్తున్న దళారులు రూటు మార్చారు. చర్ల మండలంతో పాటు ఇతర మండలాల్లో కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గడ్‌కు తరలించి విక్రయిస్తున్నారు. ఆ రాష్ట్రంలో ధాన్యం రకాన్ని బట్టి క్వింటాకు రూ.3,100 నుంచి రూ.3,500కు అక్కడి ప్రభుత్వం కొనుగోలు చేస్తుండటంతో సంపాదనే పరమావధిగా ధాన్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. నెల వ్యవధిలో వేల క్వింటాళ్ల ధాన్యాన్ని వ్యాపారులు ఛత్తీస్‌గడ్‌కు తీసుకెళ్లి అక్కడి రైతుల పేరిట అమ్ముకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఎక్కడి వారు అక్కడే ధాన్యాన్ని అమ్ముకోవాలని ఉన్నా, వ్యాపారులు అవేమీ పట్టించుకోవడంలేదు. కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని గుట్టు చప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాల వ్యాపారుల పేరుతో అమ్మకాలు సాగిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం చర్ల మండలంలో కొందరు ఓ ధాన్యం లారీని నిలిపేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. చర్ల మండలంలో పుట్టగొడుగుల్లా ధాన్యం వ్యాపారులు ధాన్యం పట్టుబడులు పడుతున్నారు. గ్రామాలకు చేరుకుని డబ్బులు చెల్లించి ధాన్యం సేకరిస్తున్నారు. అనంతరం వాటిని ఒక చోటుకు చేర్చి చర్ల మండలం సరిహద్దునున్న బీజాపూర్ జిల్లా పామేడు, ఊసూరు గ్రామాలకు వాటిని తరలిస్తున్నారు. ఎవరైనా ధాన్యం ట్రాక్టర్లు, లారీలను నిలిపితే రైతుల ధాన్యం అని చెబుతున్నారు. ధాన్యం ఛత్తీస్‌గడ్‌కు తరలించి అక్కడి వ్యాపారులకు అందజేస్తున్నారు. ఇలా వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న అక్కడి వ్యాపారులు స్థానిక రైతుల పేరిట అమ్మకాలు సాగించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా గత కొన్ని రోజులుగా ఈ వ్యాపారం సాగుతోంది.

భారీగా తరలిపోయిన ధాన్యం

రాష్ట్రంలోని మేలురకం ధాన్యం క్వింటాకు రూ.2,203, రెండోరకం క్వింటా రూ.2,183లను ప్రభుత్వం చెల్లిస్తోంది అయితే ఛత్తీస్‌గఢ్ కూడా ఇదే ధరను ఇస్తూ దీనికి తోడు బోనస్ పేరుతో మొదటి రకం రూ.3,500 రెండో రకం సుమారు రూ.3,100 చెల్లిస్తోంది. దీంతో వ్యాపారులు ఇక్కడ సేకరించిన ధాన్యాన్ని ఛత్తీస్‌గడ్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించి అమ్మడం చట్ట రీత్యా నేరమైనా వ్యాపారులు ఈ దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. అయితే తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తున్న ధాన్యంపై అక్కడి అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.



ఇటీవల ధాన్యం తరలిస్తుండగా పట్టుకున్న లారీ

దమ్మపేట గురుకులంలో ముగిసిన 'ఇగ్నైట్ ఫెస్ట్'

» ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్, ఐక్యరాజ్య సమితి సమావేశాలు

దమ్మపేట, జనవరి 4: దమ్మపేట గిరిజన గురుకుల కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన గురుకుల పాఠశాలల 'ఇగ్నైట్ ఫెస్ట్' కార్యక్రమాలు గురువారం సాయంత్రంతో ముగిసాయి.ఈకార్యక్రమాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం ప్రారంభించగా. ఖమ్మం రీజియన్ ఆర్‌సీవో, వెంకటేశ్వరరాజు పర్యవేక్షణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన 7బాలికల, 7బాలుర గురుకుల కళాశాలలకు చెందిన 15 వందల మంది విద్యార్థులు రెండురోజులుపాటు జరిగిన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఇగ్నైట్ ఫెస్ట్ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో ప్రదానంగా విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంట్, ఐక్యరాజ్యసమితి సమావేశం ఆకట్టుకున్నాయి. పార్లమెంట్, ఐక్యరాజ్యసమితి సమావేశాలు ఎలా నిర్వహిస్తారో అదే విధంగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రజాప్రతినిధుల వలే ప్రదర్శన చేశారు. ఫ్యాషన్ డ్రెస్సెస్, పాటల పోటీలు, తదిర కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ జాన్ నాయక్ మాట్లాడుతు ప్రభుత్వ గురుకులాలలో చదివే విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు ఇగ్నైట్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించామని పలు కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో జరిగే ఇగ్నైట్‌ఫెస్ట్ కార్యక్రమానికి ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి కార్యక్రమంలో భద్రాచలంలో జరుగునుందని తెలిపారు. తెలంగాణాలోని అన్ని ఉమ్మడి జిల్లాలోని గురుకుల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలో పాల్గొంటారని తెలిపారు. ఇక్కడ వివిధ కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఎంపిక చేస్తామన్నారు. వివిధ కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి బహుమతులను పారితోషికాలను అందజేసారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కళాశాలల ప్రిస్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జానునాయక్




మాక్ పార్లమెంట్, ఐక్యరాజ్యసమితి సమావేశాలు నిర్వహిస్తున్న విద్యార్థులు, కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

ఆధార్ అప్‌డేట్ కోసం పడిగాపులు

» భారీగా క్యూలో నిరీక్షణలు
» మీసేవా కేంద్రాలు వద్ద పెరుగుతున్న రద్దీ
» అదనపు సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్

మణుగూరు/పినపాక జనవరి 4: మణుగూరు మండలంతో పాటు అశ్వాపురం పినపాక, కరకగూడెం మండలాల్లో ఆధార్ సెంటర్లు జనంతో కిక్కిరిసి పోతున్నాయి. ఇవి గాక బ్యాంకులు కూడా ఆధార్‌లో మార్పు చేర్పుల కోసం కిటకిట లాడుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ పథకాలను పొందేందుకు తెలంగాణా రాష్ట్రం, అడ్రస్ మార్పు చేర్పుల కొసం వేల సంఖ్యలో ప్రజలు ఉన్న అరకొర మీ కేవా కేంద్రాలకు చేరుకుంటున్నారు. కొరికే చలిని సైతం లెక్క చేయకుండా తెల్లారుజామున మూడు గంటల నుంచి నిరీక్షిస్తున్నారు. రోజులు కేవలం 50 కార్డులకు మాత్రమే ఆధార్ అప్‌డేట్ అవకాశాన్ని కల్పించడంతో జనం నిరీక్షణలకు పోటీ పడుతున్నారు. భారీ క్యూలు కడుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ముందు నుంచి మణుగూరు డివిజన్‌లో మీ సేవా కేంద్రాలు ఉన్న ప్రజానికానికి సరిపోయే సేవలందించలేకపోతున్నాయి. సెంటర్లు పెంచాల్సిన అవసరం ఉన్నా అధికారులు స్పందించడం లేదు. దీంతో ప్రజలు దాదాపు రెండు నెలల నుంచి నానా కష్టాలు పడుతూ వస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేవారి పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉంది. పట్టణానికి చేరుకునే లోపు నిర్దేశిత సంఖ్య దాటి పోవడంతో తమ పనులు, కూలి పనులు వదిలి పెట్టి వచ్చిన వారు నిట్టూర్పుతో వెనుతిరగాల్సి వస్తోంది. కొందరైతే మధ్యాహ్నం భోజనాన్ని కూడా తెచ్చుకుని మరీ కాపలా కాస్తున్నారు. ఆధార్ అప్‌డేట్ కోసం. మరో రెండు రోజుల్లో ప్రజా పాలన సదస్సులు అయిపోతుండటం, అంతే కాకుండా ఇక ఈ పనిని ఇదే సమయంలో పూర్తి చేసుకుపోవాలని అనుకుని వచ్చేవాళ్ల సంఖ్య భారీగా పెరిగిపోతుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రజలు పాడే పాట్లు గమనించి మీ సేవా కేంద్రాలను మండలాల్లో పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


ఆధార్ అప్‌డేట్ కోసం బారులు తీరిన జనం

పినపాక: ప్రభుత్వ పథకాల అమలు, ఇతర వ్యక్తిగత ధృవీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం అన్నింటికీ ఆధారే మూలం అని ప్రకటించిన నేపథ్యంలో ప్రజలంతా ఇక ఆ దారే పట్టారు. ఆధార్ అనుసంధానం చేయించడం కోసం తెల్లవారుజామునుండే ప్రజలు ఆధార్ కేంద్రాలు, ఆధార్ పాయింట్లు ఉన్న బ్యాంకుల వద్దకు జనం పోలోమంటూ క్యూ కడుతున్నారు. అందులోను ఏజెన్సీ గ్రామాల్లో నెట్‌వర్క్‌లు సరిగ్గా పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గంటలకొద్ది క్యూ లైన్లలో నిలుచునేది ఆధార్ అప్డేట్ కోసం కాదు సుమా, ఆయా ఆధార్ కేంద్రాల నిర్వాహకులు పరిమిత సంఖ్యలో ఇచ్చే టోకెన్ల కోసం. టోకెన్ ఉన్న వారికి మాత్రమే ఆధార్ అనుసంధానం, అప్డేట్‌లు చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాలను పెంచితేనే ప్రజల సమస్యలకు వెసులుబాటు దొరుకుతుంది.

సింగరేణి సీఎండీని కలిసిన కార్మికసంఘాల ప్రతినిధులు

రుద్రంపూర్, (సింగరేణి) జనవరి 4: సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన బలరాంను సింగరేణి కార్మికసంఘాల ప్రతినిధులు హైదరాబాద్‌లో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి బృందం కలిసి తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. సింగరేణి ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంతోని నాగేశ్వరరావు సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ బ్లాక్‌ల్యాగ్ ఉద్యోగాలను భర్తీ చేయడంతోపాటు పదోన్నతులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధికి బలరాం చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి జనరల్ మేనేజరు అందెల ఆనందరావు, కాంగ్రెస్ నాయకులు పోలు పాల్గొన్నారు. సింగరేణి ఐఎన్‌టీయూసీ ప్రతినిధి బృందం చైర్మన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణిలో ఇటీవల జరిగిన గుర్తింపు కార్మికసంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ పలు ఏరియాల్లో విజయం సాధించినట్లు వివరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు జనక్ ప్రసాద్, త్యాగరాజన్, అల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు. సింగరేణి చైర్మన్‌గా బలరాంను నియమించడం పట్ల అంబేద్కర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మద్దెల శివకుమార్ హర్షం ప్రకటించారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన సమర్థవంతమైన అధికారి బలరాంకు సింగరేణి చైర్మన్‌గా అదనపు బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటి ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ప్రతినిధి బృందం చైర్మన్ బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికసంఘం నాయకులు మధు, మల్లేష్‌లు ఉన్నారు.


సీఎండీ బలరాంతో ఐఎన్‌టీయూసీ నాయకులు

పంచాయతీ నిధుల డ్రాలో డిజిటల్ 'కీ' నే కీలకం

» ఉపసర్పంచ్‌లకు సంబంధం లేకుండానే నిధులు డ్రా చేస్తున్న సర్పంచ్, కార్యదర్శులు
» ఉపసర్పంచ్ డిజిటల్ కీ కార్యదర్శి వద్దనే.. » ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

పెనుబల్లి, జనవరి 4: గ్రామపంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసేందుకు ప్రభుత్వం సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులకు డిజిటల్ 'కీ' లను అందజేశారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామసభలో సంబంధిత పనికి తీర్మానాన్ని గ్రామసభ ఆమోదించాలి. దీంతోపా టు పనుల నిర్వహణ ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించి ఎంబీ బుక్‌ల్లో నమోదు చేసిన తర్వాత నోట్‌ఫైల్‌ను తయారుచేసి దానిపై కూడా సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులు సంతకాలు చేసిన తర్వాతనే నిధులను డ్రా చేయాల్సి ఉంటుంది. కానీ మండలంలోని కొన్ని గ్రామపంచాయతీల్లో వీటితో సంబంధం లేకుండానే సర్పంచ్‌లు, కార్యదర్శులు నిధులు డ్రా చేస్తున్నారని కొందరు ఉపసర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. ఉపసర్పంచ్‌లను సైతం కొందరు సంతకం పెట్టకపోతే ఉన్నతాధికా రుల ద్వారా వారిని తొలగించే ప్రయత్నాలు కూడా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మండలంలోని 15వ ఆర్థిక సంఘం నిధులు కొందరు దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నప్పటికీ కర్రాలపాడు గ్రామ ఉపసర్పంచ్ మాత్రం కలెక్టర్‌కు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేశారు. సుమారు నెలరోజులు గడుస్తున్నప్పటికీ జిల్లా అధికారులు ఆగ్రామపంచాయతీలో విచారణ చేపట్టకపోవ డంతో ఉన్నతాధికా రుల పాత్రపై కూడా ఆయా గ్రామాల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారాల న్నింటికీ ముఖ్యపాత్ర మండల అధికారి ఒకరు వ్యవహ రిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్త తున్నాయి. ఉపసర్పంచ్ డిజిటల్ కీని దుర్వినియోగపరిచి కర్రాలపాడు గ్రామపంచా యతీలో రూ.4లక్షల నిధులను డ్రా చేశారని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని సంబం ధిత ఉపసర్పం చ్ ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు డిజిటల్ కీ ద్వారా నిధులు దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశ్యంతో నే ముగ్గురికి బాధ్యతలను అప్పగించారు. అయితే ఉపసర్పంచ్‌కి సంబం ధించిన డిజిటల్ కీ కూడ కార్యదర్శి వద్దనే ఉంచు కుంటున్నా రనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజాప్రతి నిధులు, అధికారులు ఒక్కటై నిధులు దుర్వినియో గం చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో పెనుబల్లి మండలంలో పలు పంచాయతీల్లోనూ విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆశాజనకంగా మామిడి పూత

» జాగ్రత్తలతోనే అధిక కాపు
» మొగ్గ దశలో యాజమాన్యం తప్పనిసరి
» ఉమ్మడి జిల్లాలో 63,500 ఎకరాల్లో తోటలు



ఖమ్మం వ్యవసాయం, జనవరి 4: మామిడి చెట్లు పూత పూసే సమయం ఆసన్నమైంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తక్కువగా నమోదు కాగా, ఇటీవల 'మిచౌంగ్' తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు అనేక చోట్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చాలా చోట్ల సాగు భూములు తడిగా మారాయి. ఈ పరిస్థితుల్లో మామిడి పూత బాగా రావడానికి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో సుమారు 63,500 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. సత్తుపల్లి, అశ్వారావుపేట, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, అన్నపురెడ్డిపల్లి, ఇల్లెందు, టేకులపల్లి, చంద్రుగొండ, తల్లాడ ప్రాంతాల్లో అధికంగా మామిడి తోటలున్నాయి.

మామిడి తోటలను రైతులు తేలికగా దున్నుకోవాలి. తద్వారా భూమి లోపల తేమ ఆవిరై పూత రావడానికి అవకాశం ఉంటుంది. సాధారణంగా మామిడిని ఆశించే చీడలు తోటల్లోని కలుపు, చెత్తచెదారాల్లో ఆశ్రయం పొందుతాయి. ఈ సమయంలో మామిడి తోటలో తేలికగా దున్నడం వల్ల కలుపు నివారించవచ్చు. తోటలో చెత్తాచెదారాన్ని తొలగిస్తే చీడల బెడదను చాలా వరకు తగ్గించొచ్చు.

పూత బాగా రావాలంటే

తోటల్లో దున్నిన తర్వాత చెట్లకు పొటాషియం నైట్రేట్ (13-0-45/మల్టికే, లీటరు నీటికి 10-15 గ్రాములు) అర్కా మ్యాంగో స్పెషల్ (లీటర్ నీటికి 5 గ్రాములు) లేదా ఫార్ములా-4 సూక్ష్మ పోషకాల మిశ్రామాన్ని లీటర్ నీటికి 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. దీంతో చెట్లలో పూత మొగ్గలు ఉత్తేజితమై పూత బాగా వస్తుంది.

తేనె మంచు పురుగుల నివారణ

మామిడిలో పూతకు ముందు తేనే మంచు పురుగులు, కలుపు చెత్తచెదారాల్లో దాగీ ఉంటాయి. డిసెంబర్ రెండో పక్షం నుంచి ఈ పురుగులు చెట్ల కాండము, కొమ్మలపైకి ఎగబాకుతుంటాయి. ఈ నేపథ్యంలో డిసెంబర్ మూడో వారంలో లీటరు నీటికి 1.5 గ్రాముల అసిఫేట్ లేదా క్లోరిఫైరిపాస్ 50 ఈసీ లీటరు నీటికి 1 మిల్లీలీటరు మందుతో అజాడిరిక్టిన్ 10 వేల పీపీఎం లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు కలిపి కాండము, కొమ్మలు బాగా తడిసేలా స్ప్రే చేస్తే తొలిదశలో పురుగులను నివారించవచ్చు.

చీడల నివారణ

మామిడి చెట్లలో జనవరిలో పూ మొగ్గలు రావడం మొదలవుతుంది. మామిడిని తేనే మంచు పురుగు, మిడ్జి పురుగు, పేను, బూడిద తెగులు ఆశించి నష్టపరుస్తాయి. ఈ చీడల నివారణ కోసం చెట్లలో పూత ప్రారంభ దశలో మొగ్గలుగా ఉన్నప్పుడే చర్యలు చేపట్టాలి. ఇమిడాక్లోప్రిడ్ లీటరు నీటికి 0.5 ఎంఎల్ లేదా బూప్రొపెజిన్ లీటరు నీటికి 2 ఎంఎల్ లేదా థయామిథాక్సాం లీటరు నీటికి 1 గ్రాము కలిపి పిచికారీ చేస్తే చీడలను అదుపు చేయవచ్చు. మామిడి చెట్లలో పూత పూర్తిగా వచ్చిన దశలో మందులను చెట్లపై స్ప్రే చేయవద్దు. స్ప్రే చేస్తే పిందె ఏర్పడడానికి అసవరమైన పూతలోని పుప్పొడి కొట్టుకుపోతుంది. పిందె ఏర్పడడానికి సాయపడే తేనేటీగలు చనిపోతాయి. ఈ దశలో మందులు కొడితే మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతుంది.

నీటిని నిర్లక్ష్యం చేయొద్దు

మామిడిలో పూత తర్వాత పిందే కట్టే సమయంలో చెట్లకు నీరు పెట్టాలి. దీంతో పూత పిందె రాలడం తగి, పిందెలు మంచి సైజుకు పెరుగుతాయి. పిందెలు ఏర్పడే దశ నుంచి 15 రోజుల వ్యవధిలో 2–4 సార్లు చెట్లకు నీటి తడులు పెట్టడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి.

మామిడిలో చీడ నివారణకు మందులను నిపుణులు, సంబంధిత అధికారుల సూచనల మేరకే వాడాలి. వారు సూచించిన మందులను సిఫార్సు చేసిన మోతాదులోనే రైతులు వినియోగించాలి.

ఈ విషయంలో పురుగు మందుల వ్యాపారులు లేదా మందుల స్ప్రే చేసే వారి ప్రమేయం లేకుండా చూసుకోవాలి.

రేపు మధిరలో డిప్యూటీ సీఎం భట్టికి పౌరసన్మానం


మాట్లాడుతున్న నాయకులు

మధిర, జనవరి 4: మధిరలోని రెడ్డిగార్డెన్స్‌లో శనివారం మద్యాహ్నం 3గంటలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు పౌరసన్మానం చేయనున్నట్లు మధిర కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో మధిర ఎమ్మెల్యేగా నాల్గవసారి గెలిచి రికార్డు నెలకొల్పడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన డిప్యూటీ సీఎం పదవి చేపట్టి మధిరకు ఖ్యాతి తీసుకొచ్చినందుకు భట్టివిక్రమార్కకు ఘనంగా మధిర నియోజకవర్గ ప్రజల పక్షాన పౌరసన్మానం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు ప్రకటించారు. అలాగే కేంద్ర పార్టీ ఏఐసీసీ అధినాయ కత్వానికి, అధినాయకులకు కృతజ్ఞతలు తెలపనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్ర మంలో పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో మం డల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, జిల్లా అధికారప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, మాజీ ఏఎంసీ చైర్మన్ రంగా హనుమంతరావు, నాయకులు మునుగోటి వెంకటేశ్వర్లు, పాటిబండ్ల సత్యంబాబు, దారా బాలరాజు, తూమాటి నవీన్‌రెడ్డి, మొండతోక సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వనవిహార మండపంలో రామయ్యకు విలాసోత్సవం

» నేటితో ముగియనున్న వేడుకలు


విలాసోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 4: భద్రాద్రి సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విలాసోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామచంద్రస్వామి ఏపీలోని పురుషోత్తపట్నంలో దేవస్థానం భూముల్లో ఉన్న శ్రీగోకులరామంలోని వనవిహార మండపంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం స్వామి వారిని కల్పవృక్ష వాహనంలో తిరుమల శ్రీనివాసునిగా భద్రాద్రి రామయ్యను అలంకరించి శ్రీగోకులరామంకు తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి ప్రసాద నివేదన, భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, కత్తి శ్రీనివాస్, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకులు శ్రీ పెరంబుదూర్ మదన్‌మోహనాచార్యులు, కోటి విష్ణువర్ధనాచార్యులు, అర్చకులు అమరవాది వెంకట్రామన్‌తో పాటు హరిశ్చంద్రనాయక్ కుటుంబ సభ్యులు, గట్టువెంకటాచార్య, అల్లం నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 3న విలాసోత్సవాలు ప్రారంభం కాగా శుక్రవారం వశిష్ట మండపంలో నిర్వహించనున్న విలాసోత్సవంతో ముగియనున్నాయి.

పాల్వంచలో చోరీ..

● బంగారం, వెండి ఆభరణాల అపహరణ

పాల్వంచ,జనవరి 4: పాల్వంచలో బుధవారం వెలుగు చూసిన చోరీ ఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పట్టణ పరిధిలోని కేఎస్‌ఎం మైనింగ్ కలాశాల క్వార్టర్‌లో నివాసముంటున్న పున్నం చందర్ కాకతీయ యూనివర్సిటీ వరంగల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విదులు నిర్వహిస్తున్నాడు. గత నెల 21న విధుల్లో భాగంగా వరంగల్ వెళ్లాడు. అనంతరం సెలవుల కోసం భార్య కూడా వరంగల్ వెళ్ళింది. తిరిగి అందరూ కలసి ఈ నెల 3న బుధవారం ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం, బీరువాలో నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం రూ.రెండు లక్షల యెనభైవేల రూపాయాల విలువైన బంగారు, వెండి ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లుగా గుర్తించారు. పున్నం చందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాముల తెలిపారు.

శ్రీ సాయిబాబా ఆలయంలో
అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 4: భద్రాచలంలోని శ్రీ సాయిబాబా మందిరంలో నూతన సంవత్సరంలో తొలి గురువారం పురస్కరించుకొని లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల అధినేత సాయి బాబా సేవా సమితి ఆలయ మాజీ అధ్యక్షులైన మాగంటి సూర్యం జ్ఞాపకార్ధం వారి కుమారులు మాగంటి ప్రసాద్, మాగంటి రమేష్‌బాబు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఉదయం బాబాకు అభిషేకం, అర్చనలు జరిపారు. స్వర్ణ ఆభరణాలు ధరింపజేసి హారతి పాడారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంలో భాగంగా 1300 మంది భక్తులకు బాబా వారి అన్నప్రసాదం అందించారు.

ఎంఎస్ఎంఈ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా పెద్దింటి

సత్తుపల్లిరూరల్, జనవరి 4: మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన పంచాగకర్త పెద్దింటి సూర్యనారాయ ణమూర్తి నియామకం అయ్యారు. గురువారం హైదరాబాద్‌లో ఎంఎస్ఎంఈ నేషనల్ వైస్ చైర్మన్ సీహెచ్.ప్రసారెడ్డి, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ బీ.వేణుగోపాల్ చేతులమీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ ఎంఎస్ఎంఈ ప్రోమోషనల్ కౌన్సిల్‌లో తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా పెద్దింటి సూర్యనారాయణకి నామినేటెడ్ పదవి లభించడం పట్ల అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని, జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షుడు కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ చైర్మన్ వనమా వాసు, మహిళ నాయకులు బుక్కా కృష్ణవేణి, ప్రముఖ వైద్యులు పీ.వసుమతిదేవి అభినందించారు.


నియామక పత్రం అందుకుంటున్న పెద్దింటి

గిరిజన బీఈడీ కళాశాలను సందర్శించిన
హెచ్‌సీయూ ప్రొఫెసర్


ప్రొఫెసర్‌ని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

భద్రాచలం, జనవరి 4: భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన బీఈడీ కళాశాలను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రావుల కృష్ణ గురువారం సదర్శించారు. రావుల కృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉత్తమ వ్యక్తిత్వం అలవరచుకొని జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని కోరారు. గిరిజన సమాజం, విద్యా ప్రమాణాలు, శిక్షణ విధానాలు, విద్యా ప్రయోజనాలు తదితర అంశాల గురించి విద్యార్థులతో చర్చించారు. భవిష్యత్తులో కళాశాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించడానికి సంసిద్దతను తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.లలిత కుమారి పాల్గొన్నారు.

ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి

సత్తుపల్లిరూరల్, జనవరి4: సత్తుపల్లి డిస్పెన్సరీలో బుధవారం ప్రమాదానికి గురైన ఇరువురి వ్యక్తుల పూర్తి బాధ్యత సింగరేణి బాధ్యత తీసుకోవాలని, ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బాధ్యులు తెలిపారు. గురువారం జేవీఆర్ ఓసీ మేనేజర్ నరసింహారావును కలిసి సింగరేణి వ్యాప్తంగా జరిగే ప్రమాదాలకు బాధ్యత వహించాలని, పని ప్రదేశంలో రక్షణ సూత్రాలు పాటించకుండా పనులు ఎలా చేయిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, సముద్రాల సుధాకర్, దారా భీమయ్య, సూర్యప్రకాష్, భరణి, దమ్మలపాటి నర్సింహారావు, కంచ శ్రీనివాస్, బీ.శంకర్, జయరాజు, ప్రేమ్‌కుమార్, షామంత్, రొట్టాల సురేష్, గుంజ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి 'గిరిజన ఆశ్రమ' క్రీడలు

» ప్రారంభించిన కలెక్టర్, ఐటీడీఏ పీవో

పాల్వంచ, జనవరి 4: పాల్వంచ మండలం కిన్నెరసాని క్రీడా పాఠశాలలో రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు గురువారం ప్రాంభమయ్యాయి. గిరిజన ఆశ్రమ పాఠశాలల రాష్ట్ర స్థాయి బాల బాలికల క్రీడా పోటీలను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్, కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌లు క్రీడా పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు ఆరు జోన్ల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, ఆర్చరీ, అథ్లెటిక్స్ తదితర విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు మణెమ్మ, , అధికారులు రమణయ్య, అలివేలు మంగతాయారు, గోపాలరావు, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, నెహ్రూ, చంద్రమోహన్, జహీరుద్దీన్ పాల్గొన్నారు.


క్రీడలు తిలకిస్తున్న కలెక్టర్, పీవో, ఎమ్మెల్యే జారే


అథ్లెటిక్స్‌లో పాల్గొన్న విద్యార్థినులు

650 కిలోల గంజాయి పట్టివేత

» సుమారు రూ.1.62కోట్లు ఉంటుందని అంచనా » వివరాలు వెల్లడించిన కొత్తగూడెం డీఎస్పీ రహమాన్

లక్ష్మీదేవిపల్లి, జనవరి 4: లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని రేగళ్లక్రాస్‌రోడ్ వద్ద లక్ష్మీదేవిపల్లి పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో 650కేజీల గంజాయిని పట్టుకున్నారు. దీని విలువ రూ.1,62,50,000 ఉంటుందని పోలీసులు వెల్లడించారు. లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ రహమాన్ వివరాలను వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం, నాగూర్ జిల్లా, అలాయి గ్రామానికి చెందిన సుందర్‌రామ్ అదే ప్రాంతానికి చెందిన క్లీనర్ సురేష్‌తో కలిసి తన లారీలో డిసెంబరు 22న లోడ్ చేసుకున్న మూంగ్‌దాల్ ప్యాకెట్లను నాగూరు నుంచి తీసుకొని రాజమండ్రిలో గత నెల 28న అన్‌లోడ్ చేశారు. అనంతరం వారు రాజస్థాన్ రాష్ట్రం బికనీర్ జిల్లాకు చెందిన ఓం ప్రకాష్ చెప్పినట్లు గంజాయిని తీసుకెళ్లేందుకు డిసెంబరు 31న రాజమండ్రి నుంచి చింతూరుకు బయలుదేరి రాత్రి చింతూరుకు దగ్గరగా ఉన్న అటవీ ప్రాంతానికి చేరుకుని ఓంప్రకాశ్‌కు ఫోన్ చేయగా గంజాయి రావడానికి రెండు రోజులు పడుతుందని చెప్పగా అక్కడే లారీని నిలిపి ఉంచారు. తరువాత ఈ నెల 3న మళ్లీ ఓంప్రకాశ్‌కు ఫోన్‌చేయగా తనకు సంబంధించిన ఇద్దరు వ్యక్తులను పంపించి వారిని సమీప అటవీప్రాంతంలో గంజాయిని రహస్యంగా ఉంచిన చోటుకు తీసుకెళ్లగా అక్కడ లారీలో గంజాయిని లోడ్ చేసుకుని 3వ రాత్రి రాజస్థాన్‌కు బయలు దేరారు. ఈ క్రమంలో గురువారం ఉదయం లక్ష్మీదేవిపల్లి మండలం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేగళ్ల క్రాస్‌రోడ్ వద్ద ఎస్ఐ సంతోష్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా (ఆర్‌జె21 జిబి5297) లారీలో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు. లారీ డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకుని లారీని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరి కొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పెద్దమొత్తంలో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నందుకు పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్ఐలు సంతోష్, వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

యమా రంజు కోడి పుంజు



- సంక్రాంతి పందాలకు సిద్ధమైన కోళ్లు
- ఒక్కో పుంజుపై రూ.25 వేల నుంచి రూ.40 వేల మధ్య ఖర్చు
- మేత మెనూలో పిస్తా, బాదం, మటన్ కీమా
- ఉదయాన్నే ఈత, శరీర పటుత్వానికి వాకింగ్
- పుంజును బట్టి ఒక్కోదానికి రూ.లక్షన్నర వరకు ధర

ఉదయం లేవగానే గోరు వెచ్చని నీటితో స్నానం.. పచ్చటి పామాయిల్ తోటల్లో వాకింగ్.. పిస్తా, బాదంపప్పులు, తృణధాన్యాలతో అల్పాహారం.. మటన్ కీమాతో ఆహారం.. పందాలలో శిక్షణ.. ఇలా చెప్పుకుంటే పోతే పందేపుకోడి పుంజుల దర్జానే వేరు. వాటికి అందుతున్న రాజభోగాలే వేరు. సంక్రాంతి పండగ సమీపించిన నేపథ్యంలో కోడి పందాల పెంపకం, వాటిని ఎంపిక చేసుకునే తీరు, పందాలలో ఇచ్చే శిక్షణ, తదితర అంశాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.
-అశ్వారావుపేట

పందాలకున్న ప్రత్యేకత వేరు

సంక్రాంతికి కోడి పందాలకున్న ప్రత్యేకతే వేరు. పందాలు వేయాలంటే ప్రధానమైంది కోడి పుంజే. కోట్లల్లో పందాలను కాస్తుంటారు కాబట్టి జాతి కోడి పుంజులను ఎంపిక చేసుకుంటారు. వాటిల్లోనూ సమయం ఆధారంగా కోడి రంగు, ఇతర పరిస్థితులను అంచనా వేసుకొని ఎంపిక చేసుకుంటారు. అందుకే జాతి కోడి పుంజులను ఎంపిక చేసుకొని, వాటికి తగిన శిక్షణ, ప్రత్యేకంగా తయారు చేసిన ఆహార పదార్థాలు, ఈత కొట్టించడం ద్వారా కోడి పుంజులకు శిక్షణ ఇచ్చి పందాలకు సిద్ధం చేస్తున్నారు.

ఎంతైనా ఖర్చు చేస్తారు

కోడి పుంజుల కోసం పందెపురాయుళ్లు ఎంతైనా ఖర్చు చేస్తారు. ఒక్క అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాల్లో దాదాపు 100వరకు జాతి కోడి పుంజుల కేంద్రాలు వెలిశాయి అంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇవే కాక వందల సంఖ్యలో 10 నుంచి 50 కోడి పుంజులను ఇళ్ల వద్దే కుటీర పరిశ్రమ మాదిరి పెంచి అమ్మేవారు చాలా మంది. అశ్వారావుపేటలోని అల్లిగూడెం, గంగారం పరిసరాల్లోను, దమ్మపేట మండలంలోని మందలపల్లి హైవే పక్కన కోడి పుంజుల పెంపకం కేంద్రాలు వెలిశాయి. ఒక్కో చోట 100 నుంచి 300 వరకు కోడి పుంజులను పెంచుతున్నారు. పామాయిల్, కొబ్బరి తోటల్లో బోర్లకు దగ్గరలో ప్రత్యేక స్థలాన్ని ఎంపిక చేసుకొని పలు రకాల జాతి కోడి పుంజులను పెంచుతున్నారు. సీసీ కెమెరాల పహారాలో, పదుల సంఖ్యలో పాలేర్లను పెట్టుకొని కోడి పుంజులను పెంచుతున్నారు ఒక్కో కోడి పిల్లను రూ.10 వేల నుంచి రూ.30వేల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసి వాటిని పెంచి పందానికి సిద్ధం చేస్తున్నారు.

ప్రత్యేక ఆహారం

కోడి పుంజులకు జీడిపప్పు, బాదం పప్పు, మటన్ కీమా, రాగి సంగటి, ప్రత్యేకించి ఎంచుకున్న దాణాను ప్రతి రోజు ఓ క్రమపద్ధతిలో కోడి పుంజులకు ఆహారంగా అందిస్తుంటారు. ప్రత్యేకంగా సిద్ధం చేసిన నీటి తొట్టిలు (స్విమ్మింగ్‌పూల్)లో కోడి పుంజులను రోజు పది నుంచి 15 నిమిషాల పాటు ఈత కొట్టిస్తుంటారు. ఒళ్లంతా గట్టిపడేలా ప్రత్యేకంగా వామ్ అప్ చేయిస్తుంటారు. వ్యాధులు సోకకుండా వ్యాక్సీన్లు, మందులను వాడుతుంటారు. చిన్న పిల్లలకంటే ఎంతో అ ల్లారు ముద్దుగా, ప్రత్యేకించి సిద్ధం చేసిన ఆహారాన్ని అందిస్తూ, అప్పడప్పుడు కోళ్లను ఎగిరిస్తూ శిక్షణ ఇస్తుం టారు.

ఒక్కో కోడి పుంజు ధర రూ. లక్షపైమాటే

ఇలా పెంచిన కోడి పుంజును ఒక్కో దానిని లక్ష నుంచి లక్షన్నర వరకు విక్రయి స్తుంటారు. ఎక్కువగా ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారు వచ్చి కోడి పుంజులను కొనుగోలు చేస్తారు. ఒక్కో కోడి పుంజును పెంచడానికి రూ.25 నుంచి 40 వేల మధ్య ఖర్చవు తుంది. ఆహార పదార్థాలతో పాటు సీసీ కెమెరాలు, విద్యుత్ దీపాలు, కోడి పుంజులకు ప్రత్యేకంగా పెన్సింగ్‌లు ఏర్పాటు చేస్తారు. కొన్ని పెంపకం కేంద్రాలలో జాతి కోడి పుంజులను, పెట్టలను సైతం తెచ్చి, వాటిని క్రాస్ చేయించి గుడ్డు పెట్టించి, పిల్లలను పెంచుతారు. ఇది నిరంతర శ్రమ. ఏడాదంతా కష్టపడితే సంక్రాం తి సీజన్‌లో మాత్రమే వీరికి మంచి డిమాండ్ ఏర్పడు తుంది.



ప్రత్యేకంగా జాతులు

డేగ, కాకి, పచ్చకాకి, సేత్రు, నెమలి, కేతు, పింగళ వంటి జాతులను కోడి పందాల్లో వినియోగిస్తారు. పుంజుల్లో రంగులు, ఈకలు, ప్రత్యేక లక్షణాలను బట్టి ఇవి ఏ జా తికి చెందినవో పందెపు రాయుళ్ళు గుర్తు పడతారు. ఎదుటి కోడి జాతిని బట్టి ఏ జాతి పుంజును పందానికి దింపాలో నిర్ణయించుకుంటారు.

భారీగా లావాదేవీలు

సంక్రాంతి సమీపిస్తుండటంతో నిర్వాహకులు కోడి పుంజులను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో కోడి పుంజును కనీసం లక్ష రూపాయలకు విక్రయిస్తున్నారు. 100 నుంచి 300 వరకు కోడి పుంజును పెంచేవారికి భారీగా ఆదాయం లభిస్తుంది. ఈ పుంజులతో పందాలు వేయడం ద్వారా భారీగా లావాదేవీలు జరుగుతుంటాయి. పందెపు రాయుళ్ళకు ప్రత్యేకంగా వెతుక్కోకుండా అశ్వారావుపేట పరిసర ప్రాంతాల్లోనే ఏ జాతి కోడి పుంజు కావాలంటే అది అందుబాటులో ఉండటంతో వారు మరింత హుషారుగా ఉన్నారు.



నెమలి కోడి పుంజు



కాకి పుంజుకు ఈతలో శిక్షణ



పందేనికి సిద్ధంగా డేగ



పామాయిల్ తోటలో పెరుగుతున్న కోడి పుంజులు



కోడి పుంజులకు పందెంలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో జాప్యం వద్దు

తొమ్మిది నెలల్లో పూర్తి కావాలి .. గోద్రెజ్ కంపెనీ బాధ్యులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

కొణిజర్ల, జనవరి 4: 'పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో ఆలస్యం చేయొద్దు. రైతులు ఇప్పటికే చాలా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే గడువు లోపు నిర్మాణం పూర్తి చేయాలని' వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత కంపెనీని ఆదేశించారు. మండలంలోని అంజనాపురం సమీపంలో గోద్రెజ్ కంపెనీ నిర్మించనున్న పామాయిల్ ఫ్యాక్టరీ స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా కంపెనీ బాధ్యులకు దిశానిర్దేశం చేశారు. ఫ్యాక్టరీని తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని, లేదంటే తను పూర్తి చేయించమంటే చేయిస్తామని మంత్రి అన్నారు. రైతులు ఇబ్బందులు చూడలేకపోతున్నామని, ఇక్కడ పండించిన పంటను ఎక్కడో అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఫ్యాక్టరీ నిర్మాణం పనులు పూర్తి చేయాలని తెలిపారు. మంత్రి వచ్చిన విషయం తెలుసుకున్న ఫ్యాక్టరీ కోసం భూములు ఇచ్చిన రైతులు కొంతమంది అక్కడకు చేరుకున్నారు.

రైతులకు నష్టం జరగనివ్వం

గత ప్రభుత్వం ఎకరానికి రూ. 27 లక్షలు చొప్పున తమ వద్ద భూములు కొన్నదని, ఫ్యాక్టరీ వారు మాత్రం రూ. 20లక్షలు మాత్రమే ఇచ్చారని తమకు అన్యాయం జరుగుతోం దని రైతులు విన్నవించారు. దీంతో మంత్రి స్పందిస్తూ రైతులకు నష్టం జరగనివ్వనని, ఎంత రావాలో తెలుసుకొని న్యాయం చేయిస్తానని, ఫ్యాక్టరీ నిర్మాణం మాత్రం అడ్డుకోవద్దని కోరారు. మంత్రి చెప్పిన మాటలకు రైతులు ఒప్పుకున్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల ఈ ప్రాంత రైతుల ముఖచిత్రం ఒక్కసారిగా మారుతుం దని తుమ్మల అన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే ఇక్కడి రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గతంలో అశ్వారావుపేట, దమ్మపేటలో పామాయిల్ ఫ్యాక్టరీలు నిర్మించామని, దాని వల్ల అక్కడి ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందాయన్నారు. అనంతరం గుబ్బగుర్తి సమీపంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి చైర్మన్ చేపట్టిన చేపల పెంపకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, ఎంపీపీ గోసు మధు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతగాని జయపాల్, కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావు, రాంపుడి రోశయ్య, వడ్డే నారాయణరావు పాల్గొన్నారు.



గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న తుమ్మల

రూ.1.5లక్షల చెక్కును అందించిన తుమ్మల

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి4: కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతున్న నిరుపేద మహిళకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అండగా నిలిచారు. తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడేనికి చెందిన దేరంగుల పద్మ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు స్పందించి బాధిత కుటుంబానికి రూ.1.5లక్షల ఎల్వోసీ లేఖను గురువారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి తుమ్మలను కలిసిన

తమిళనాడు రైతు

తమ రాష్ట్రానికి రావాలని ఆహ్వానం
నూనె ఉత్పత్తులతో సేంద్రియ ఎరువులు తయారుచేస్తున్న కుప్పుస్వామి

ఖమ్మం/సత్తుపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : నూనె ఉత్పత్తులతో సేంద్రియ ఎరువులను తయారుచేసి.. అధిక దిగబడులు సాధిస్తున్న తమిళనాడు రైతు కుప్పుస్వామి గురువారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం పాకాలగూడెంలో రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. తమిళనాడులో తాను సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న పంటలను పరిశీలించేందుకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా కుప్పుస్వామి మాట్లాడుతూ తెలంగాణలో ఒక ఆదర్శ రైతు వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారన్న విషయం తెలుసుకుని తాను రాష్ట్ర ఉద్యానశాఖ మాజీకమిషనర్ వెంకటరామిరెడ్డి సాయంతో ఇక్కడకు వచ్చానని, అది కూడా ఆయన తన వ్యవసాయక్షేత్రంలో ఉండగా కలవడం సంతోషంగా ఉందన్నారు. తాను సంగారెడ్డిలో 25 ఎకరాల వ్యవసాయక్షేత్రాన్ని కౌలుకు తీసుకుని మొదట్లో రసాయనిక ఎరువులు వాడి నష్టపోయానని, తర్వాత నూనెగింజలను గానుగ ఆడించడం ద్వారా వచ్చిన నూనెలతో పాటు ఆయిల్ తీసిన తర్వాత వచ్చే పిప్పిని కలిపి సేంద్రియ ఎరువులను తయారుచేశానని, తద్వారా అధిక దిగబుడులు సాధించానని వివరించారు. సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుందని, తాను ఉద్యానపంటలతోపాటు పలు పంటలను సాగుచేస్తున్నానని కుప్పుస్వామి తుమ్మలకు వివరించారు. తమిళనాడు వచ్చి తాను చేస్తున్న సేంద్రియ పంటల సాగును, నూనె, వాటి ఉప ఉత్పత్తులతో సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించాలని తుమ్మలను కోరారు. ఈ క్రమంలో సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధిస్తున్న కుప్పుస్వామిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు.



మంత్రి తుమ్మలను కలిసిన తమిళనాడు రైతు కుప్పుస్వామి

పది విద్యార్థులకు అందని అల్పాహారం

ప్రత్యేక తరగతుల వేళ ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

తల్లాడ, జనవరి 4: పదోతరగతి విద్యార్థులకు అదనపు తరగతులు ప్రారంభించి రెండునెలలవుతున్నప్పటికీ అల్పాహారం అందడం లేదు. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఫలితాల సాధన కోసం విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వ హిస్తున్నారు. జిల్లాలోని 469 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 16,514 మంది పదోతరగతి విద్యార్థులకు గత నవంబరు ఆరోతేదీ నుంచి అదనపు తరగతులు జరుగుతున్నాయి. పాఠశాల పనిదినాల్లో ప్రతిరోజూ ఉదయం ఎనిమిదిన్నరగంటల నుంచి తొమ్మిదిన్నరగంటలు, సాయంత్రం 4.15గంటల నుంచి 5.15గంటల వరకు అదనపు తరగతులు జరుగుతున్నాయి. ఇందు కోసం ప్రత్యేకంగా సబ్జెక్టుల వారీగా టైంటేబుల్ కూడా రూపొందించారు.

అదనపు తరగతుల దృష్ట్యా..

ప్రతి సోమవారం ఉదయం సాంఘీక శాస్త్రం, సాయంత్రం తెలుగు, మంగళవారం ఉదయం తెలుగు, సాయంత్రం హిందీ, బుధవారం ఉదయం జీవశాస్త్రం, సాయంత్రం ఇంగ్లీష్, గురువారం ఉదయం ఇంగ్లీష్, సాయంత్రం గణితం, శుక్రవారం ఉదయం గణితం, సాయంత్రం భౌతిక శాస్త్రం, శనివారం ఉదయం భౌతిక శాస్త్రం, సాయంత్రం సాంఘీక శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు విద్యార్థులకు అదనపు తరగతుల ద్వారా బోధిస్తున్నారు. అదనపు తరగతుల నిర్వహణ దృష్ట్యా ఉదయం 8.30గంటల నుంచి సాయంత్రం 5.15గంటల వరకు పదోతరగతి విద్యార్థులు పాఠశాలలోనే ఉండాల్సి ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కొన్ని సంవత్సరాలుగా అదనపు తరగతులకు హాజరయ్యే పదోతరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం పంపిణీ చేసేవారు. ఇందుకోసం ఒక్కో విద్యార్థికి రెండున్న రూపాయల చొప్పున ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించేది.

అదనపు తరగతులు ప్రారంభమైనా..

ప్రస్తుతం పదోతరగతి అదనపు తరగతులు ప్రారంభమై రెండునెలలు కావస్తున్నప్పటికీ అల్పాహారానికి నిధులు విడుదల కాలేదు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ముగిసే మార్చి నెలాఖరు వరకు అదనపు తరగతులు కొనసాగనున్నాయి.



అదనపు తరగతులకు హాజరైన పది విద్యార్థులు

అల్పాహారాన్ని అందించాలి

ఎం.నవదీపిక, పదోతరగతి విద్యార్థిని



రెండునెలలుగా అదనపు తరగతులకు హాజరవుతున్న మాకు అల్పాహారాన్ని అందించాలి. దీనివల్ల శక్తి వనగూరి చదువుపట్ల ఆసక్తి పెరుగుతుంది. అల్పాహారానికి వెంటనే నిధులు విడుదల చేయాలి. అదనపు తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అల్పాహారానికి నిధులు విడుదల చేయాలి

అల్పాహారం కోసం ఎదురుచూస్తున్నాం

షేక్.చాంద్‌పాషా, పదోతరగతి విద్యార్థి



పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఫలితాల సాధన కోసం రెండునెలలుగా మాకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30గంటల నుంచి సాయంత్రం 5.15గంటల వరకు పాఠశాలలోనే ఉండవల్సి వస్తుంది. ఎక్కువ సమయం పాఠశాలలో ఉండాల్సి రావడంతో అలసటకు గురవుతున్నాం. అలసట నుంచి బయటపడేందుకు అల్పాహారం అందిస్తే బాగుంటుంది.

తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటా: తుమ్మల

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి4: తన గెలుపుకోసం కృషిచేసిన తెలంగాణ ఉద్యమకారులకు ఎల్లవేళలా అండగా ఉంటానని రాష్ట్రవ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం తెలంగాణ ఉద్యమకారుల స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు ఇంటిలో తేనీటి విందు స్వీకరించారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ తన గెలుపుకోసం కృషిచేసిన తెలంగాణ ఉద్యమకారులను ఏ ఆపద వచ్చినా అన్ని వెళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మలకు డాక్టర్ కేవీ కృష్ణారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బావిని, బోరును ఆక్రమించిన కాంపౌండ్ తొలగించిన దృశ్యం

కబ్జా నుంచి బావి, బోరుకు విముక్తి

- అక్రమార్కులు నిర్మించిన కాంపౌండ్ తొలగింపు
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు
- కృతజ్ఞతలు తెలిపిన గట్టుమల్లారం వాసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మణుగూరు, జనవరి 4: అక్రమార్కుల పాపం పండింది. వారి కబ్జా ఎత్తులు అధికారులు కన్నెర్ర చేయడంతో చిత్తయ్యాయి. అంతే కాదు వారు నిర్మించిన కాంపౌండ్ తొలగిపోయింది. మణుగూరు మండల పరిధిలోని గుట్ట మల్లారంలోని ప్రజా అవసరాల నిమిత్తం కొన్నేళ్లగా బావి, బోర్ ఉన్న ప్రాంతాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నించారు. దీనిపై ఆంధ్రజ్యోతి జనవరి ఒకటో తేదీన దర్జాగా ప్రభుత్వ స్థలం కబ్జా అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు సర్పంచ్‌తో పాటు గ్రామస్థులు స్పందించారు. గురువారం ఈ విషయాన్ని భద్రాచలం ఆర్డీవో మంగీలాల్ దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారులను కూడా సదరు కబ్జాదారులు ఫోర్జరీ పత్రాలతో మోసం చేసిన తీరును వివరించారు. దీంతో స్పందించిన ఆర్డీవో మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అక్రమార్కులు ఆ స్థలాన్ని కబ్జా చేసి వేసిన కాంపౌండ్‌ను తొలగించాలని సూచించారు. మండల ఆర్ఐ శ్రీనివా సరావు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని రేకులతో నిర్మించిన కాంపౌండ్‌ను తొలగించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'ఐలు' సావనీర్‌ను ఆవిష్కరించిన న్యాయాధికారి

మణుగూరుటౌన్, జనవరి 4: ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్(ఐలు) ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న కానిస్టిట్యూషన్ అండ్ వుయ్ ద పీపుల్ సావనీర్‌ను మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ న్యాయాధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. గురువారం కోర్టు ఆవరణలో ఐలు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో ఉన్నత న్యాయస్థానంతోపాటు ఇతర రాష్ట్రాల ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తులు అభిప్రాయాలు, ఆలోచనలతో ఈ సావనీర్ రూపుదిద్దుకుందని ఈ సందర్భంగా ఐలు బాధ్యులు పేర్కొన్నారు. అనంతరం సావనీర్‌తోపాటు నూతన సంవత్సర ఐలు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఐలు మణుగూరు మండల అధ్యక్షుడు భాస్కర్, న్యాయవాదులు కందిమళ్ల నర్సింహారావు, కిషన్‌రావు, విజయరావు, సర్వేశ్వరరావు, పద్మావతి, సంధ్య, వాసవీ, రుద్ర వెంకట్, నాగార్జునరెడ్డి, సాంబ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'కు దరఖాస్తుల వెల్లువ

ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలు కొనసాగుతున్నాయి. సభల్లో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఆరో రోజు గురువారం వివిధ పథకాల కోసం ప్రజలు తమ దరఖాస్తులను అందజేశారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి: పాయం

అశ్వాపురం: నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామపంచాయతీలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలుకోసం చేపట్టిన ప్రజాపాలనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కాగా మొదటిసారి తుమ్మలచెరువులో పర్యటించిన పాయంకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, మండల ప్రత్యేకాధికారి వీరన్న, ఎంపీఈవో శ్రీనివాస్, ఏడీఏ తాతారావు, నెల్లిపాక సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అందడమే ప్రజాపాలన లక్ష్యం

బూర్గంపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందడమే కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన లక్ష్యమని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని అంజనాపురం గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ గ్రామసభను గురువారం ఎమ్మెల్యే పాయం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించినటువంటి ఆరు గ్యారంటీల హామీలు అర్హులైన ప్రతి ఒక్కరికి వచ్చే విధంగా కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. సారపాకలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభను అదనపు కలెక్టర్ రాంబాబు సందర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, మండల ప్రత్యేక అధికారి తిరుమలేష్, ఏడీఏ తాతారావు, ఎంపీడీవో వివేక్ రామ్, సర్పంచ్ భారతి తదితరులు పాల్గొన్నారు.

పగిడేరులో ప్రారంభించిన ఎమ్మెల్యే

మణుగూరుటౌన్: మండల పరిధిలోని పగిడేరులోని పగిడేరు, శాంతినగర్ గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజాపాలన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోయే ఆరు పథకాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లిలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే

ములకలపల్లి: ములకలపల్లి మండలంలో గురువారం సీతయ్యగూడెం గ్రామపంచాయతీలో ప్రజాపాలన గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామ సభలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు.

పథకాల అమలుకు ప్రభుత్వం కృషి

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసేందుకు కృషి చేస్తుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అంకంపాలెం గ్రామంలో గురువారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొని పథకాల కోసం చేసుకున్న దరఖాస్తులను ఎమ్మెల్యే స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో నాగేశ్వరరావు, సర్పంచ్ కాకా అనూష తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో ఎంతో మేలు: కోరం

ఇల్లెందు టౌన్: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం ఇల్లందు పట్టణంలోని 12, 13 వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఆరు గ్యారంటీలను ప్రభుత్వం శరవేగంగా చేస్తుందని వివరించారు. పేదలకు మేలు కలిగించే విధంగానే గ్యారంటీలు ఉన్నాయని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వేంకటేశ్వరావు, కమిషనర్ నవీన్‌కుమార్, మేనేజర్ అంకుశావలి, కౌన్సిలర్లు పద్మ, అనిత పాల్గొన్నారు.

ప్రజాపాలనను సందర్శించిన ప్రముఖులు

దుమ్ముగూడెం: మండలంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలను ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు, అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ మంగీలాల్‌లు సందర్శించారు. నడికుడి, చిననల్లబల్లి, నరసాపురం గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును ఎంఎల్ఏ పరిశీలించారు. అలాగే నరసాపురం గ్రామసభను జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలు సందర్శించి పలు సూచనలు చేశారు. ఆరు పంచాయతీల్లో మొత్తం 1870 దరఖాస్తులందినట్లు ఎంపీడీవో ముత్యాలరావు తెలిపారు. ఎంపీపీ లక్ష్మి, జడ్పీటీసీ సీతమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభయహస్తంకు దరఖాస్తుల వెల్లువ

అశ్వారావుపేట రూరల్: ఐదు గ్యారంటీల పథకాల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో గురువారం ఐదు పంచాయతీల్లో ప్రజాపాలన ద్వారా దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుమ్మడివల్లి పంచాయతీల్లో రెండో రోజు దరఖాస్తుల స్వీకరణ చేపట్టగా తిరుమలకుంట, కోయరంగాపురం పంచాయతీల్లో మాత్రం ప్రజాపాలన సదస్సులు జరిపి దరఖాస్తుల స్వీకరించారు. ఆయా పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన ప్రత్యేక బృందాలు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఈలు లక్ష్మీ, కృష్ణ, కృష్ణార్జునరావు, ఏవో నవీన్, ఎంపీవో సీతారామరాజుతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు చివరి రోజు

ఆళ్లపల్లి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీల పథకాల దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారం ముగుస్తుందని ఎంపీడీవో రామారావు మండల ప్రజలకు సూచించారు. ప్రజాపాలన సభలో భాగంగా గురువారం ఆయన మర్కోడు సభలో మాట్లాడుతూ.. మర్కోడులో మూడు రోజుల పాటు 796 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్ బాబు, ఎపీఎం రామ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, నాగరాజు, జీవన్, వెంకట్, వివిధ శాఖల ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

జూలూరుపాడు: నిరుపేదలకు ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అందించేందుకుగాను నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు కోరారు. గురువారం మండలంలోని జూలూరుపాడు, పడమటనర్సాపురం, కాకర్ల, పాపకొల్లు గ్రామ పంచాయతీలలో ప్రజాపాలన కార్యక్రమాలను నిర్వహించారు. 1484 మంది దరఖాస్తులు అందజేశారు. ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శారద, ఎంపీవో తులసీరాం, ఏవో రఘుదీపిక, ఆర్ఐ తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


తుమ్మలచెరువులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

సుజాతనగర్‌లో..

సుజాతనగర్: సుజాతనగర్ మండలంలో మూడు పంచాయతీలలో సుజాతనగర్, నాయకుల గూడెం, రాఘవాపురం గ్రామ పంచాయతీలలో ఆరవ రోజు గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. సుజాతనగర్ మండల కేంద్రమైన సుజాతనగర్ గ్రామ పంచాయతీలో జరుగుతున్న ప్రజా పాలన దరఖాస్తులను అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) మధుసూధన రాజు పరిశీలించి, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. సుజాతనగర్ గ్రామ పంచాయతీలో మూడు రోజులు కలిపి 1602 దరఖాస్తులు, నాయకుల గూడెం గ్రామ పంచాయతీలో మొదటి రోజు 623 దరఖాస్తులు, రాఘవాపురం గ్రామ పంచాయతీలో 441 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తును స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు


దుమ్ముగూడెంలో దరఖాస్తును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్


ములకలపల్లిలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జారే


సుజాతనగర్ మండలం రాఘవాపురం గ్రామసభ


జూలూరుపాడులో దరఖాస్తును స్వీకరిస్తున్న ఎంపీడీవో

తుమ్మలను కలిసిన అడిషనల్ డీఆర్డీవో


తుమ్మలకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న అడిషనల్ డీఆర్డీవో

దమ్మపేట, జనవరి 4: వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరావును అడిషనల్ డీఆర్డీవో రవికుమార్ గురువారం గుండుగులపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తుమ్మలకు శుభాకాంక్షలు తెలిపి, ఆయన చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, వసంతరావు, నాగుపల్లి మాజీసర్పంచ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గన్నీ బ్యాగులందాయి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దుమ్ముగూడెం, జనవరి 4: మారాయిగూడెం జీసీసీ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి స్థానిక ఆదివాసీ రైతులకు గురువారం గన్నీబ్యాగులందాయి. 'మారాయిగూడెంలో కొనుగోలు కేంద్రం ఉన్నట్లా...లేనట్లా' అనే శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడింది. కేంద్రం ప్రారంభమై నెల వుతున్నప్పటికీ, ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలనుకునే రైతులకు గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని, ప్రైవేటు వ్యాపారుల నుంచి ధాన్యం కొనుగోలుకు కేంద్రం సిబ్బంది ఆసక్తి చూపుతున్నారనే ఆరోపణలు వెలువడ్డాయి. స్పందించిన జీసీసీ మేనేజరు డేవిడ్ గురువారం మారాయిగూడెం కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో బస్తాలు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తానని సేల్స్‌మేన్‌ను హెచ్చరించినట్లు తెలిపారు. కేంద్రం వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని సూచించారు. బస్తాలు అందుబాటులోకి రావడంతో బాధిత రైతులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ మంత్రిని కలిసిన టీఆర్‌వీకేఎస్ నాయకులు


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

పాల్వంచ, జనవరి 4: ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను టీఆర్‌వీకేఎస్ నాయకులు గురువారం కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసిన నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన భట్టి విక్రమార్క కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్, ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాష్, రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, జెన్కో కార్యదర్శి రమేష్, నాయకులు నిరంజన్, యూసుఫ్, దేవేందర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలి

జూలూరుపాడు, జనవరి 4: వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిలో సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ వెంకట్ సూచించారు. గురువారం జూలూరుపాడులోని పెండ్యాల భాగ్యమ్మ మెమోరియల్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో అమలు చేస్తున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు బోధన మెళకువలను వివరించారు.

అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు

దుమ్ముగూడెం, జనవరి 4: రామమందిర ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని అయోధ్య నుంచి విచ్చేసిన రామ అక్షింతలకు గురువారం లక్ష్మీనగరం దాసాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర, శతనామ, పుష్పార్చనలను శాస్త్రోపేక్తంగా నిర్వహించారు. అక్షింతలను గ్రామంలో ఊరేగించారు. అర్చకులు రాజగోపాలాచార్యులు, ఆలయ వ్యవస్థాపకులు డాపిన్నింటి రాజశేఖర్ దంపతులు, చైర్మన్ రాఘవరెడ్డి, టీటీడీ ధర్మాచార్య పిలకా నాగేంద్రరెడ్డి, తాతారావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు అయోధ్య అక్షింతలు

పాల్వంచటౌన్: పాల్వంచ పట్టణంలోని మార్కెట్ ఏరియాలో శ్రీరామాలయ భజన మందిరం సేవాదళ్ వారి ఆధ్వర్యంలో గడప గడపకు అయోధ్య అక్షింతలను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భజనమందిరం మాజీ కమిటీ సభ్యులు చలువాది ప్రకాష్, పెండ్యాల రోజాలక్ష్మి, చలువాది రాజ్యలక్ష్మి, ఇందిర, ఝాన్సీ, మంజుల, మౌనిక, దుర్గ, కుసుమ, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెంలో..

కరకగూడెం: మండలంలోని మోతె గ్రామంలో గురువారం అయోధ్య రామ మందిరం నుంచి తీసుకొచ్చిన పవిత్రమైన అక్షింతలను ఎల్లు సోమిరెడ్డి ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్షింతలను 15వ తేది వరకు మండలంలోని అన్ని గ్రామాలలోని ప్రతి ఇంటికి చేర్చడం జరుగుతుందని తెలిపారు. జనవరి 22వ తేదిన అయోధ్య రామ మందిరం వద్ద ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా రామ భక్తులు అందరూ అక్షింతలను తలపై వేసుకోవాలన్నారు. అనంతరం ప్రతి ఒక్కరి ఇంటి ముందు 5 దీపాలను వెలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొడగం వెంకన్న, వాలద్రి ఆశోక్, రాజన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.


దుమ్ముగూడెంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సుజాతనగర్‌లో..

సుజాతనగర్: శ్రీరామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ ద్వారా మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానానికి వచ్చిన అయోధ్య రామయ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం సుజాతనగర్ మండలంలోని సుజాతనగర్, కేశవాపురం, సిరిపురం గ్రామాలలోని వాడలా వాడలా తిరిగి, ప్రతి గడప గడపకూ వెళ్లి వారికి సంప్రదాయబద్ధంగా కుంకుమ బొట్టు పెట్టి, గంధం పూసి ఈ అక్షితలతో పాటుగా అయోధ్యరామాలయ నమూనా, విగ్రహ ప్రతిష్ఠ అహ్వాన పత్రికను, అందించారు. 15వ తేదీ వరకు అందరికీ పంపిణీ చేస్తామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి సత్యన్నారాయణాచార్యులు, ట్రస్ట్ సభ్యులు, భక్తులు కోటేశ్వరరావు, సుజాత, శ్రీలత, డాక్టర్ పోటు రాఘవరావు, బసవపూర్ణ, సౌజన్య, కవిత, శ్రీదేవి, ప్రసాద్, మిడతనపల్లి శ్రీనివాస్, చందర్, నుగ్గల శ్రీను, మౌలాలి, శ్యాం రెడ్డి, మధు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

'పాయం'కు డీఎంహెచ్‌వో శుభాకాంక్షలు

మణుగూరుటౌన్, జనవరి 4: పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శిరీష గురువారం మర్యాదరపూర్వకంగా ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. శాలువాతో సత్కరించి పూల బొకేను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో నెలకొన్న సిబ్బంది సమస్యతో మౌళిక సదుపాయాలపై ఎమ్మెల్యే పాయంతో డీఎంహెచ్‌వో శిరీష చర్చించినట్లు తెలిసింది. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పేద ప్రజలకు మెరుగైన వైద్య అందించేందుకు తనశాయశక్తుల కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయాధికారి గంజికుంట్ల సంజీవరావు, ఏరియా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో శిరీష

పంచాయతీలను అభివృద్ధి చేస్తా: పాయం

మణుగూరుటౌన్, జనవరి 4: మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రభావిత ప్రాంతాలను ప్లాంట్ సీఎస్ఆర్ నిధులతో గ్రామాల్లో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రామానుజవరం పంచాతీలోని కొండాయిగూడెం గ్రామంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమ్మేళనంలో బీటీపీఎస్, సింగరేణి సంస్థలకు చెంతనే ఉన్న రామానుజవరం గ్రామానికి ఇప్పటి వరకు సీఎస్ఆర్ నిధులు విడుదల చేయలేదని గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పాయం బీటీపీఎస్, సింగరేణి సంస్థల నుంచి సీఎస్ఆర్ నిదులు విడుదల కృషి చేసి పంచాయతీ పరిధిలోని గ్రామాల అభివృద్ధి కృషి చేస్తానన్నారు. దీంతోపాటు బీటీపీఎస్ రైల్వే ట్రాక్ ఏర్పాటులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీ అయోధ్య, రామానుజవరం సర్పంచ్ బాడిస సతీష్, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, వైస్ఎంపీపీ కే వీ రావు, సమితిసింగారం ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్, శ్రీకాంత్, ఆకుల నరసింహారావు, దాచేపల్లి శ్రీను, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో మాట్లాడుతున్న పాయం

మారుతి కళాశాలలో ఉద్యోగ నియామకాలు



భద్రాచలం, జనవరి 4: భద్రాచలంలోని మారుతి నర్సింగ్ కళాశాలకు చెందిన 47 మంది విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్ ద్వార ఓమెగా సూపర్ స్పెషాలీ వైద్యశాల, హైదరాబాద్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి పవిత్రమైందని, విధి నిర్వహణను బాధ్యతతో చేపట్టాలని విద్యార్థులకు సూచించారు.

ఆర్డీవోను కలిసిన రేషన్ డీలర్లు

అశ్వాపురం, జనవరి 4: భద్రాచలం ఆర్డీవో మంగీలాల్‌ను మండల రేషన్ డీలర్లు గురువారం ఆయన కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవోకు పుష్పగుచ్ఛం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

అశ్వాపురం, జనవరి 4: మండలంలోని గొల్లగూడెం గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎంపీపీ ముత్తినేని సుజాత ఆధ్వర్యంలో గొల్లగూడెం గ్రామస్థులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రం సమర్పించారు. మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలసి సమస్యలను విన్నవించారు.

విద్యార్థులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు

మణుగూరుటౌన్, జనవరి 4: మణుగూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం మణుగూరు మున్సిపాలిటీ, మండలంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ముందుగా ఆయా వసతి గృహాల్లోని విద్యార్థులకు రక్తహీనత వ్యాధిపై వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, సూపర్‌వైజర్ జానకి, వైద్య సిబ్బంది రాంప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైన్‌షాపుల వర్కర్లు ఐక్యంగా ఉండాలి

మణుగూరుటౌన్, జనవరి 4: మణుగూరు పట్టణం, మండలంలోని వైన్ షాపుల్లో పనిచేస్తున్న వర్కర్లు ఐక్యంగా ఉంటూ తమ సంక్షేమం కోసం పాటు పడాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు అయోధ్య అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగి వైన్ షాప్స్ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంక్షేమం, హక్కుల కోసం పోరాడుతూనే వ్యాపార రీత్యా వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. సంక్షేమం కోసం వర్కర్లు ఆర్థిక నిధిని ఏర్పాటు చేసుకోవలని సూచించారు. వర్కర్లకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మీనారాయణ, వైన్‌షాప్స్ వర్కర్ల అధ్యక్షుడు పగిడయ్య, సభ్యుల లక్ష్మణ్, నరసింహారావు, ఉసికల కొండయ్య, సంపత్, ఉప్పలయ్య, సాంబ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.